సాక్షి నిర్మల్

మంగళవారం | 28 | నవంబర్ | 2023



కార్తీక దీపోత్సవం

6లో▸

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయాలను సందర్శించి మొక్కు తీర్చుకున్నారు.



ఖానాపూర్ బస్టాండ్ తనిఖీ

ఖానాపూర్: ఖానాపూర్ బస్టాండ్‌ను సోమవారం నిర్మల్ ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కంట్రోలర్లు మొహినొద్దీన్, శంకర్‌నాయక్ ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /20.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్ల బడుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి'

నిర్మల్‌టౌన్: ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసుల వాట్సాప్ నంబర్ 8712659599కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

'108'లో ప్రసవం



పాపతో సిబ్బంది, బంధువులు

భైంసా/ముధోల్: బాసర మండలం టాక్లి గ్రామానికి చెందిన సరస్వతి నిండు గర్భిణికి సోమవారం ఆమెకు పురుటినొప్పులు వచ్చాయి. ఆమె బంధువులు 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న సిబ్బంది ఆమెను అంబులెన్స్‌లో ఏరియాస్పత్రికి తరలిస్తున్నారు. ఈక్రమంలో తరోడ గ్రామం వద్ద ఆమెకు నొప్పులు ఎక్కువ కాగా పైలట్, సిబ్బంది వాహనాన్ని నిలిపి ఆమెకు పురుడుపోశారు. రెండో కాన్పులో ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని ఏరియాస్పత్రికి తరలించామని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

ఉట్నూర్‌కు ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: సాధారణ ఎన్నికల దృష్ట్యా సిబ్బంది, ప్రయాణికుల కోరిక మేరకు ఉట్నూర్‌కు ఈ నెల 29న ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. టికెట్ల కోసం http://www.tsrtconline.inలో లేదా నిర్మల్ బస్టాండ్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌కు ఆప్ మద్దతు



ఐకేరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సయ్యద్ హైదర్

నిర్మల్‌టౌన్: మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ప్రకటించింది. సోమవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఐకేరెడ్డిని ఆప్ నాయకుడు సయ్యద్ హైదర్ కలిశారు. నిర్మల్‌లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ఐకేరెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. నాయకుడు సూర్యనారాయణ తదితరులున్నారు.

విసుగెత్తిస్తున్న టెలికాలర్స్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల వేళ టెలికాలర్స్ ఓటర్లను విసుగెత్తిస్తున్నారు. సమయం, సందర్భం లేకుండా ఫోన్‌కాల్స్ చేస్తుండగా ఓటర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సర్వేల పేరిట ఏ పార్టీకి మద్దతిస్తున్నారు? ఎవరికి ఓటు వేస్తున్నారు? అంటూ ఆరా తీస్తున్నారు. తమ పార్టీకే ఓటేయాలని కాల్‌రికార్డింగ్‌ల ద్వారా అభ్యర్థులు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఓటర్ల ఫోన్లకు తరచూ ఈ తరహా కాల్స్ వస్తుండగా వారు అసహనానికి గురవుతున్నారు.

బాసర ఆలయంలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సరస్వతీ మంత్రసహిత చండీ హోమం నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే మాసపూజలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, కలశ స్థాపన, రక్షా బంధనం, మండపారాధన, పుణ్యాహవాచనం, దీక్ష సంకల్పం చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు, ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదపండితులు, పూజారులతో వైభవంగా హోమం నిర్వహించారు.

నిర్మల్ పోరు.. గెలిచేదెవరు?

- నియోజకవర్గంలో త్రిముఖ పోటీ
- 'తగ్గేదేలే..' అంటున్న పాతకాపులు
- అంతుచిక్కని ఓటరు మనోగతం..!
- ఆరా తీస్తున్న విదేశాల్లోని స్థానికులు



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి | కూచాడి శ్రీహరిరావు | ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: 'హలో.. బావా..! ఏం నడుస్తుందే మన నిర్మల్ల..? ఈసారి టగ్ ఆఫ్ వార్ ఉందట కదా..! ఏ పార్టీ గెలుస్తదో.. ఎవరు విన్నర్‌గా నిలుస్తరో.. చెప్ప లేకుండా నడుస్తున్నదట నిజమేనా..? మనవాళ్ల ఫేస్‌బుక్‌లో, వాట్సప్‌లో పోస్టులు చేస్తున్నది చూస్తుంటే.. ఏ పార్టీ గెలుస్తుందో చెప్పలేమన్నది కరెక్టే అనిపిస్తోంది.. ఇంతకు నువ్వేమంటవ్ బావా..!' అని అమెరికాలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సునీల్ ఆతృతగా తన బావ శ్రీనివాస్‌కు వాట్సప్ కాల్ చేసి అడుగుతూనే ఉన్నాడు.

'అవున్రా.. సునీల్. ఈసారి నెక్ టు నెక్ అన్నట్లు గానే ఉందిక్కడ. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడింటి మధ్య నువ్వా? నేనా?.. అన్నట్లు పోటాపోటీ నడుస్తోంది. ఇంద్రకరణ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీహరిరావు పాతకాపులే.. ఈసారి తగ్గేదేలే.. అన్నట్లు పోటాపోటీగా తలపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎటూ చెప్పలేకపోతున్నాం. ఎవరు గెలుస్తరోనన్నది తేల్చాలంటే కష్టంగానే ఉందిరా..' అని నిర్మల్‌లో వ్యాపారం చేసుకుంటున్న శ్రీనివాస్ జవాబిచ్చాడు.

ఇలా వీళ్లిద్దరే కాదు.. నిర్మల్ నియోజకవర్గంపై సరిహద్దులు దాటి చర్చ సాగుతోంది. రాష్ట్రంలోనే పోటాపోటీ ఉన్న టాప్-10 నియోజకవర్గాల్లో నిర్మల్ ఉంది.

ఎదురులేని కారు..

ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించడంతో బీఆర్‌ఎస్ ప్రచారంలో ప్రత్యర్థి పార్టీలకు అందనంత వేగంలో ఉంది. ఆగస్టులోనే తన అభ్యర్థిత్వం ఖరారు కావడంతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనూ చుట్టేశారు. తనతో పాటు తన కుటుంబసభ్యులు, సీనియర్ నాయకులు రంగంలోకి దిగారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చెబుతూ జనాలను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సంస్థాగతంగా బలమైన క్యాడర్ ఉండటంతో పాటు కుటుంబపరమైన బలగం కలిసొచ్చే అంశాలు. ఏళ్లుగా రాజకీయంలో ఉన్న అనుభవం, తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులూ ఇక్కడ అల్లోలకు కలిసి వస్తున్నాయి. ఈనెల 2వ తేదీన నిర్మల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభ కూడా కలిసివస్తోంది.

బలపడ్డ బీజేపీ..

గతంలో ఎప్పుడూ లేనట్లు ఈసారి ఎన్నికల్లో బీజేపీ బలంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కని పార్టీ ఇప్పుడు గెలుస్తామని చెబుతోంది. ఇక వరుస ఓటములను ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి, విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక సమస్యలపై ఆయన చేపట్టిన కార్యక్రమాలు, దీక్షలు, తరలివచ్చిన రాష్ట్ర నేతలతో ప్రజల్లోకి మరింత చొచ్చుకెళ్లారు. ప్రచారంలో భాగంగా ప్రతీ ఊరిని, ప్రతీ ఇంటిని విడిచిపెట్టకుండా వెళ్లారు. తన సతీమణి, కుటుంబసభ్యులూ ప్రచారంలో పాల్గొన్నారు. రెండ్రోజుల క్రితం నిర్మల్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభ విజయవంతం కావడం తమకు మరింత కలిసి వస్తుందని ఏలేటి, బీజేపీ శ్రేణులు భావిస్తున్నారు.

పట్టు బిగించిన హస్తం

ఏఐసీసీ, డీసీసీ స్థాయి ఉన్న నేతలు, సీనియర్ నాయకులంతా కొన్నినెలల క్రితం పార్టీని వీడటంతో కాంగ్రెస్ ఒక్కసారిగా ఢీలాపడింది. అలాంటి సమయంలో తెలంగాణ ఉద్యమనేతగా ముందుండి పోరాడిన కూచాడి శ్రీహరిరావు పార్టీలో చేరడంతో మళ్లీ హస్తం బలం పుంజుకుంది. ప్రచారాన్ని ఆలస్యంగా ప్రారంభించినా చివరిదశకు వచ్చేసరికి పట్టు బిగించింది. సీనియర్ నేతగా, ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తింపు ఉన్న శ్రీహరిరావు గతంలో రెండుసార్లు ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో నాయకులందరినీ కలుపుకొని పోతూ ప్రతీఓటరును పలకరిస్తున్నారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, పారదర్శక పాలన చూపిస్తానని చెబుతున్నారు. అన్నివర్గాల అండతో తామే గెలుస్తామన్న ధీమాను కాంగ్రెస్ వ్యక్తపరుస్తోంది. రేవంత్‌రెడ్డి సభ, ఆరు గ్యారంటీలే తమను గెలిపిస్తాయని భావిస్తోంది.

ముగ్గురూ మొనగాళ్లే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయకేంద్రంగా పేరున్న నిర్మల్ నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇక్కడ బీఆర్‌ఎస్ నుంచి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఉండగా, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీ నుంచి బరిలో నిలిచారు. ఉద్యమకారుడిగా, సీనియర్‌నేతగా ప్రజల్లో పేరున్న కూచాడి శ్రీహరిరావు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. ఈ ముగ్గురూ 2009, 2014 ఎన్నికల్లోనూ నువ్వా? నేనా?.. అనే తరహాలో పోటీపడ్డారు. ఈసారీ అదే సీన్ రిపీట్ అవుతోంది. ముగ్గురు పాత ప్రత్యర్థుల మధ్య అసెంబ్లీ పోరు సీరియస్‌గా సాగుతోంది.

నిర్మల్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు

పురుషులు	1,20,365
మహిళలు	1,32,925
ఇతరులు	19
మొత్తం	2,53,309

విజేతలెవరో..!

రాష్ట్రవ్యాప్తంగా బలమైన పోటీ ఉన్న పలు నియోజకవర్గాల జాబితాలో నిర్మల్ కూడా కొనసాగుతోంది. ఇక్కడి పోటీపై విదేశాల్లో ఉంటున్న స్థానిక ఓటర్లలోనూ ఆసక్తి నెలకొంది. వారంతా స్థానికంగా ఉంటున్న తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రులకు రోజుకోసారి ఫోన్ చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ మండలం ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతుంది.. గ్రామాల వారీగా గాలి ఎటు పోతుంది.. అన్న అంచనాలు వేస్తున్నారు. వీటి ప్రకారం ఎవరు గెలిచే అవకాశముందని లెక్కలు వేసుకుంటున్నారు. మొత్తం మీద నిర్మల్ నియోజకవర్గ త్రిముఖ పోరులో ఎవరు విజేతగా నిలుస్తారోనన్నది ఇప్పుడే చెప్పలేమంటున్నారు.

మున్నూరుకాపులు నా గుండెల్లో ఉన్నారు

- ప్రత్యర్థుల ఫేక్ ప్రచారం నమ్మొద్దు
- బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్
- ముధోల్‌లో వైరల్ ఆడియోపై వివరణ



మాట్లాడుతున్న బీజేపీలోని మున్నూరుకాపు నేతలు

భైంసాటౌన్: 'మున్నూరుకాపులను నమ్మలేదు.. వారికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వలేదు' అని బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ ఫోన్‌లో ఓ వ్యక్తితో మాట్లాడినట్లుగా ఆడియో సోమవారం వైరలైంది. దీనిపై ఆ పార్టీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ వెంటనే ఓ వీడియో సందేశం విడుదల చేశారు. తనకు మున్నూరుకాపులు ఎల్లప్పుడూ అండగానే ఉన్నారని, వారి ప్రోద్బలంతోనే బండి సంజయ్ సమక్షంలో తాను బీజేపీలో చేరానని చెప్పారు. మున్నూరుకాపులు తన గుండెల్లో ఉంటారని, గతంలో ఆ సామాజికవర్గానికి చెందిన పలువురికి మున్సిపల్, ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ పదవులు కూడా కట్టబెట్టినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున తన విజయం తథ్యం కావడంతో గిట్టనివారు ఇలా అసత్య ప్రచారానికి పూనుకున్నారని వివరణ ఇచ్చారు. ఇలాంటి ఫేక్ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ ఆడియో వైరల్ చేసిన వారిపై సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బీజేపీ గెలుస్తుందనే అసత్య ప్రచారం

ముధోల్‌లో బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ విజయం దాదాపు ఖాయం కావడంతోనే కొందరు ఆయనపై అసత్య ప్రచారానికి పూనుకున్నారని ఆ పార్టీలోని మున్నూరుకాపు నాయకులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను మున్నూరుకాపులను కించపరిచేలా మాట్లాడలేదని రామారావుపటేల్ ఇప్పటికే భగవద్గీతపై ప్రమాణం చేశారని పేర్కొన్నారు. మున్నూరుకాపుల్లో ఐక్యతను దెబ్బతీసేందుకే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బాధ్యులపై ఫిర్యాదు చేస్తామన్నారు. తామంతా బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, నాయకులు బోయిడి విఠల్, అయ్యన్నగారి భూమయ్య, తాడేవార్ సాయినాథ్, తూం దత్తు, అల్లకొండ సాయినాథ్, గాలి రవి, దిలీప్, తోట విజయ్, మల్లేశ్వర్ తదితరులున్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



ఖానాపూర్: మార్కెట్‌యార్డులో తడిసిన వరి ధాన్యం



లక్ష్మణచాంద: పీచరలో తడిసిన వరి ధాన్యం



ముధోల్: ముద్గల్‌లో తడిసిన వడ్లు చూపుతున్న రైతు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలకొరిగిన కోతకు వచ్చిన వరి చేలు
- ఆందోళన చెందుతున్న బాధిత రైతులు
- తడిసిన ధాన్యం కొనాలని డిమాండ్

లోకేశ్వరం/ముధోల్/లక్ష్మణచాంద/ఖానాపూర్/కడెం/కుంటాల/సారంగపూర్: జిల్లాలోని పలు మండలాల్లో కురిసిన అకాల వర్షం అన్నదాతలకు నష్టం కలిగించింది. లోకేశ్వరం మండల కేంద్రంతోపాటు మండలంలోని రాజూరా, మన్మద్, పోట్‌పల్లి(ఎం), పుస్పూర్, హవర్గ, బిలోలి, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, ఎడ్దూర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో సోమవారం ఉదయం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మొక్కజొన్న, వరి, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసిపోయింది. మండలంలో 35.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మోతీరాం తెలిపారు. ముధోల్ మండలం ముద్గల్, మచ్కల్, రాంటెక్ తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు ఆరబోసుకున్న వరి ధాన్యం తడిసిపోయింది. లక్ష్మణచాంద మండలం పీచర, ధర్మారం, పొట్టపెల్లి (కే), లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, వడ్యాల్, మునిపెల్లి, చింతల్‌చాంద తదితర గ్రామాల్లో వరి ధాన్యం తడిసి ముద్దయింది. సారంగపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. కోతకు వచ్చిన వరి చేలు దెబ్బతిన్నాయి. జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నగేశ్‌రెడ్డి, రాజేశ్వర్, భీంరావు, ప్రభాకర్, లక్ష్మారెడ్డి, భోజన్న తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఖానాపూర్ మండలంలోని ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిసింది. కడెం మండలం కొత్త మద్దిపడగ, ధర్మాజీపేట్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం, ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కుంటాల మండల కేంద్రంతోపాటు మండలంలోని ఓల, అందాకూర్, కల్లూర్, లింబా(కే), లింబా(బీ), అంబకంటి గ్రామాల్లో సోమవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.



లోకేశ్వరం: మండల కేంద్రంలో నేలకొరిగిన వరి



లోకేశ్వరం: మండల కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

ప్రచారం.. సమాప్తం

- నేటి సాయంత్రంతో ప్రక్రియ పూర్తి
- నిలిచిపోనున్న ప్రచార రథాలు
- మూగబోనున్న మైకుల హోరు
- ఆగిపోనున్న ఆటాపాటలు



నిర్మల్/నిర్మల్‌ఖిల్లా: కారును గుర్తుంచుకోవాలని అధికార బీఆర్‌ఎస్..
కదలిరా.. కదలిరా.. అంటూ బీజేపీ..
మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి.. అని హస్తం పార్టీ.. నిత్యం హోరెత్తించాయి. ఏ ఊరెళ్లినా.. ఏ గల్లీలో తిరిగినా ప్రచార వాహనాల హోరు.. ఈ పాటల జోరే కనిపిస్తోంది. తమ నియోజకవర్గాల్లో నలుదిక్కులా కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లే అభ్యర్థులు నిమిషం తీరిక లేకుండా తిరుగుతూనే ఉన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇక.. ఈ ప్రచారపర్వానికి నేటితో తెరపడనుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. ఈలెక్కన మంగళవారం సాయంత్రం ఐదుగంటలతో అభ్యర్థుల ప్రచారం ముగియనుంది.

ఇక కొద్ది గంటలే..

ఎన్నికల ప్రచారపర్వానికి ఇంకా కొన్ని గంటలే మిగిలి ఉంది. ఈ కొంతసమయంలో ఎంత వీలైతే అంత ఎక్కువమంది ఓటర్లను కలవడమే ఇప్పుడు అభ్యర్థుల ముందున్న లక్ష్యం. అందుకే జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులు చివరిరోజంతా క్షణం తీరిక లేకుండా గడపేలా షెడ్యూల్ రూపొందించుకున్నారు. మరోవైపు ఎన్నికలకు రెండురోజులే గడువుంది.

నైట్ నుంచి సైలెంట్‌గా..

ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగియనుండగా ఇక ప్రలోభాల పర్వానికి తెరలేవనున్నారు. మంగళవారం రాత్రి నుంచే సైలెంట్ ప్రచారమే ఉంటుంది. ఈరెండు రోజులు మొత్తం ప్రలోభాల రాజకీయం సాగనుంది. ఇప్పటికే పలు పార్టీలు, అభ్యర్థులకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాయి. ఇన్నిరోజులు చేసిన ప్రచారం ఒకెత్తయితే.. నేటి నైట్ నుంచి సాగే కథ మరో ఎత్తు. అందుకే మూడు ప్రధాన పార్టీలూ సీరియస్‌గా ఎత్తుగడలు వేస్తున్నాయి. మరోవైపు అధికారులు ప్రలోభాలపైనా దృష్టిపెడతామని హెచ్చరిస్తున్నారు.

జిల్లాను చుట్టేసిన ప్రధాన పార్టీలు..

జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన ముధోల్, ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర అధినాయకులంతా ప్రచారానికి వచ్చి బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ నుంచి ప్రధాని నరేంద్రమోదీతో పాటు ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ లాంటి ముఖ్యనేతలు పాల్గొనగా.. కాంగ్రెస్ తరఫున రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, విజయశాంతి తదితర నేతలు జిల్లాలో ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ తరఫున సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్ తదితర నేతలు కూడా వివిధ సభల్లో పాల్గొని అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సాధారణ పరిశీలకులు సూచించారు. సాధారణ పరిశీలకులు రవిరంజిత్‌కుమార్ విక్రమ్, కే గోపాలకృష్ణ, వ్యయ పరిశీలకులు శ్రెయస్, లక్ష్మణ్ నింబార్గి సోమవారం జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఆదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పోలీస్, రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రచార సమయం ముగుస్తుందని, అనంతరం 48గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్‌కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అన్ని చర్యలూ చేపట్టాలి

పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

ఈ నెల 30న నిర్వహించనున్న పోలింగ్‌కు ముందు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా పార్టీ లేదా అభ్యర్థి ప్రింట్ మీడియాలో ఎన్నికల రోజు గాని ముందురోజు గాని ఎన్నికల ప్రకటనలు ప్రచురించరాదని ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. మంగళవారం 28వ తేదీ సాయంత్రం 5గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంసీఎంసీ అనుమతి లేకుండా రాజకీయ పార్టీ, అభ్యర్థి 48 గంటల నిశబ్ద సమయంలో ప్రవర్తనా నియమావళిని ధిక్కరిస్తే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కు కోసం దుబాయ్ నుంచి రాక



దుబాయ్ నుంచి వచ్చిన భూమేష్

లక్ష్మణచాంద: ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన యువకుడు కుంటాల భూమేష్ ఏకంగా దుబాయ్ నుంచి తన సొంత గ్రామానికి వచ్చాడు. సోమవారం దు బాయ్ నుంచి వచ్చిన భూమేష్ ఇంద్రకరణ్ రెడ్డిపై ఉన్న అభిమానంతో గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నాడు. కేవలం ఓ టు హక్కును వినియోగించుకోవడం కోసమే తను ఇంటికి వచ్చినట్లు భూమేష్ తెలిపాడు.

బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో సాయిరాం



బెండే సాయిరాం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన బెండే సాయిరాం బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 9న మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్రస్థాయి జట్టులో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి జట్టుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. ఈ 24 నుంచి 27వ తేదీ వరకూ పంజాబ్ రాష్ట్రంలోని అకాల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన 36వ బేస్ బాల్ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొన్నాడు. సాయిరాంను బేస్‌బాల్ జిల్లా అధ్యక్షుడు తుల శ్రీనివాస్, కార్యదర్శి రాజశేఖర్‌తో పాటు కోచ్‌లు గౌతమ్, గంగాధర్, పీఈటీలు అజయ్ అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం



పిడుగుపాటుతో కాలిపోయిన విద్యుత్‌వైర్లు

సోన్: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం పిడుగు పడిన సంఘటన మండలం కూచన్‌పెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. ఉదయం ఒక్కసారిగా వర్షం కురిసింది. ఆ సమయంలో అమీద్‌ఖాన్, మహ్మద్ అలీమ్ తండ్రికొడుకులు పంట పొలానికి వెళ్తూ వర్షం రావడంతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పక్కన గల రేకులషెడ్డు కిందకు వెళ్లారు. అదే సమయంలో మెరుపులతో కూడిన భారీ శబ్దం వచ్చింది. దీంతో వారు స్పృహ తప్పి పడిపోయారు. ఆలయంలోని విద్యుత్ మెన్ బోర్డు, బల్బులు, వైర్లు పూర్తిగా కాలిపోయాయి.

పోలింగ్ ప్రక్రియ ఇలా..

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు అత్యంత కీలకం. అయితే ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈవీఎంల తరలింపు మొదలుకొని ఓటింగ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుంది. ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద గల స్ట్రాంగ్ రూములకు తరలించే వరకు కొనసాగే ప్రక్రియ, పోలింగ్ అధికారుల విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు, తదితర అంశాలపై ప్రత్యేక కథనం...

- ఎన్నికల సిబ్బంది విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు
- పోలింగ్ మొదలుకొని కౌంటింగ్ కేంద్రాల వరకు..
- వివిధ దశల్లో అనుక్షణం అప్రమత్తం
- సమన్వయంతోనే సజావుగా పూర్తి..



ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే రెండు విడుతలుగా శిక్షణ పూర్తయింది. అయితే పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలు ఎన్నికల రోజు ఆయా రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు పాత్ర కీలకంగా ఉంటుంది..

ఈ నెల 29న పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించబడిన పోలింగ్ సిబ్బంది ఒక్కో కేంద్రానికి నలుగురు ఒకరోజు ముందే నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల వద్ద నుండి ఎన్నికల సామగ్రిని స్వీకరించి సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

మాక్ పోలింగ్‌తో మొదలు...

ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎం యంత్రాలతో పాటు సిబ్బంది 29నే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. పోలింగ్ రోజు ఉదయం 5:30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున వచ్చిన పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6:30 లోపే మాక్ పోలింగ్ ప్రక్రియను ముగించాలి. మాక్ పోలింగ్‌లో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓట్లు వేసి పరిశీలించాల్సి ఉంటుంది. అన్నిసరిగానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వారి సమక్షంలో ఈ యంత్రాలను క్లియర్ చేసి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది.

పోలింగ్ ఏజెంట్ల పాత్ర ..

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కేంద్రాలలో రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటరు నిజమైన వ్యక్తి లేదా బోగస్ ఓటరా అని పోలింగ్ ఏజెంట్లు నిశితంగా పరిశీలిస్తారు. పోలింగ్ కేంద్రంలో ప్రతి అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. అందులో ఒక్కరు మాత్రమే కూర్చోడానికి అవకాశం ఉంటుంది. పోలింగ్ ఏజెంట్లు ఫారం 10లో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ నియామక పత్రం పొందిన వారికి ఏజెంట్ పాసును జారీ చేస్తారు. ఓటరు జాబితాను బయటకు తీసుకు వెళ్లేందుకు వీలు ఉండదు పోలింగ్ ఏజెంట్లు స్థానికుడై ఉండి ఎన్నికల కమిషన్ అనుమతించిన ఫొటో గుర్తింపు కార్డును కలిగి ఉండాలి.

రెండు గంటలకొసారి పోలింగ్ శాతం వెల్లడి..

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు ఓసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా వెల్లడిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 17-ఏ రిజిస్టర్లో నమోదైన ఓట్లు, ఓటర్ స్లిప్పులు, కంట్రోల్ యూనిట్లలో గల మొత్తం నమోదైన ఓట్లు ఏకీభవించాలి. అప్పుడే పోలింగ్ శాతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపుతారు. సెక్టారు అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారాన్ని అందిస్తారు.

పోలింగ్ అధికారుల విధులు ఇలా...

ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందిదే బాధ్యత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి మరో ఇద్దరు ఇతర ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఉంటారు. పోలింగ్ కేంద్రం మొత్తం బాధ్యతను ప్రిసైడింగ్ అధికారి పర్యవేక్షిస్తారు.

పోలింగ్ ముగింపు...

పోలింగ్ సమయం ఐదు గంటలకు ముగుస్తుండగా 15నిమిషాల ముందే వెల్లడించాల్సి ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు వేయటానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు 17-ఏ లో గల మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు సరిపోలతో ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

ఆదిలాబాద్ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు	
ఆదిలాబాద్: 290	బోథ్: 302
మొత్తం: 592	

నిర్మల్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలు	
ఖానాపూర్: 305	
నిర్మల్: 306	ముధోల్: 311
మొత్తం: 922	

మంచిర్యాల జిల్లాలో	
మంచిర్యాల: 289	
చెన్నూర్: 227	బెల్లంపల్లి: 227
మొత్తం: 743	

ఆసిఫాబాద్‌లో జిల్లాలో..	
ఆసిఫాబాద్: 305	సిర్పూర్: 294
మొత్తం: 599	

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా...

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల్లో పంపిణీ కేంద్రాలకు చేరుస్తారు. ఆ మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలవద్దగల స్ట్రాంగ్ రూంలోనికి తరలిస్తారు.

తానూరులో భక్తజన జాతర

- ఆకట్టుకున్న కుస్తీ పోటీలు
- ఆసక్తిగా తిలకించిన భక్తజనం



రథం లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం జరిగిన జాతరకు భక్తులు పోటెత్తారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా సమీప గ్రామాలతోపాటు సరిహద్దు మహారాష్ట్రవాసులు హాజరయ్యారు. మరో పండరిపురంగా భావించే ఈ ఆలయానికి చేరుకుని విఠలరుక్మాబాయి దర్శనం చేసుకుని మొక్కు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని ఇళ్లన్నీ బంధువులతో సందడిగా మారాయి. తానూరు ప్రధాన రహదారి, పోలీస్‌స్టేషన్ ప్రాంతం, సంత స్థలం, హైస్కూల్ ఆవరణ అంతా చిరుదుకాణాలతో నిండిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసిన జనంతో కొనుగోళ్ల సందడి కనిపించింది. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగుల రాట్నంలో తిరుగుతూ ఉత్సాహంగా కనిపించారు. ఆదివా రం అర్ధరాత్రి రథయాత్ర నిర్వహించగా లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. సాయంత్రం పూజలు చేశాక భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం హైస్కూల్ ఆవరణలో విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో కుస్తీ పోటీలు ప్రారంభించారు. మహా రాష్ట్రలోని ఔరంగాబాద్, నాందేడ్, పర్బణి, పుణేతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీలో తలపడ్డారు. విజేతకు రూ.11,111 తో పాటు వెండి కడియం, ద్వితీయ స్థానంలో నిలి చిన మల్లయోధుడికి రూ.8,851తో పాటు వెండి కడియం బహూకరించి సన్మానించారు. కాగా, ఇక్కడ నిర్వహించే జాతర 105 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించారు. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

భారీగా మద్యం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు
- 876బాటిళ్లు, ఆటో, సెల్‌ఫోన్ సీజ్

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న భారీ మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మేరకు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఠాగూర్ హోటల్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో క్రాంతినగర్‌కు చెందిన షేక్ అఫ్రోజ్, షేక్ కలీంలు ఆటోలో దాదాపు రూ.లక్షా 30వేల విలువ గల 876 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్, వన్‌టౌన్ సీఐ కె.సత్యనారాయణలు సంయుక్తంగా పట్టుకున్నారు. విచారణలో సంజయ్ కుమార్ అనే వ్యక్తి ఈ మద్యం బాటిళ్లను తీసుకురావాలని చెప్పారన్నారు. ముగ్గురిపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక ఆటోతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మద్యం పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

మద్యం పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు భీంపూర్ వద్ద సిబ్బందితో కలిసి ఎస్సై తనిఖీలు నిర్వహించారు. భీంపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అరవింద్, రాథోడ్ గణేష్ అనే వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 180 ఎంఎల్ కలిగిన 192 మద్యం బాటిళ్లను గుర్తించారు. సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మద్యాన్ని సీజ్ చేశారు. పట్టుకున్న మద్యం విలువ రూ.34వేల విలువ ఉంటుందని అంచనా వేశారు. ఎన్నికల వేళ అక్రమంగా మద్యం తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. వారి వెంట సిబ్బంది దినేష్ రాథోడ్, రమేష్, గోకుల్ ఉన్నారు.



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

అక్రమ మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ పట్టుకుని సీజ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా రూ.28వేలా 600 విలువ గల మద్యం పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇద్దరు వ్యక్తులపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సంజయ్‌నగర్‌కు చెందిన షేక్ సల్మాన్ వద్ద 32బాటిళ్లు లభించాయి. వీటి విలువ రూ.7600 వరకు ఉంటుందన్నారు. అలాగే కలెక్టర్ చౌక్‌లో తలమడుగు మండలానికి చెందిన దివాకర్ వద్ద 24బాటిళ్లు లభించినట్లు తెలిపారు. వీటి విలువ రరూ.21వేలు ఉంటుందని పేర్కొన్నారు.



సీజ్ చేసిన మద్యంతో పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మావల పోలీసులు సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి మండలానికి తరలిస్తుండగా 15లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వాటిని తరలిస్తున్న నానాక్‌సింగ్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పూలే జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలి

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్

ఎదులాపురం: ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే, భారత్ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రలను పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని అఖిల భారతీయ మాలి మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 28 సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే 133 వర్ధంతిని పార్టీలకతీతంగా నాయకులు, బహుజనవాదులు, మాలీకులస్తులు ఘనంగా నిర్వహించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం జ్యోతిబాపూలే ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ అంబేకర్, అనిల్ కోట్రంగే, పట్టణ కార్యదర్శి సుభాష్ శేండే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

సాధనతోనే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారు

- జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే గొప్ప క్రీడాకారులుగా ఎదగవచ్చని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాక్సింగ్ ఎంతో సాహసవంతమైన క్రీడ అని పేర్కొన్నారు. ఈ క్రీడలో రాణించాలంటే ఎంతో మనోధైర్యం ఉండాలన్నారు. ప్రస్తుతం జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలు గా నిలుస్తుండటం శుభ పరిణామమన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు డిసెంబర్ 12 నుంచి మంచిర్యాలలో జరిగే ఉమ్మడి జిల్లా (జో నల్ స్థాయి) పోటీల్లో పాల్గొంటారని వెలడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ శేఖర్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజేందర్, బేగ్, బాక్సింగ్ కోచ్ సాయి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని భట్టిగల్లికి చెందిన గడపాలే రాందాస్(36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. రాందాస్ స్థానికంగా కూలీ పనులు చేస్తుండగా దాదాపు రెండేళ్ల కిందట భార్య, పిల్లలతో కలిసి వదిలివెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమివ్వగా, వారు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆమోస్ తెలిపారు.

ఘనంగా శేష వాహన సేవ..



జైనథ్: మండల కేంద్రంలో కొలువైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి ఘనంగా శేషవాహన సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి శేషహోమం, బలిహరణం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంలో ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు.

కార్తీక దీపోత్సవం..



దస్తురాబాద్: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని రేవోజీపేట, మున్యాల, బుట్టాపూర్, దస్తురాబాద్ గ్రామాల్లోని శివాలయాలు, మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కారించుకొని ఇళ్లల్లో మహిళలు తులసీ పూజలు చేశారు.

కనులపండువగా...

సోన్ : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం న్యూవెల్మల్, న్యూబొప్పారం గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా హన్మండ్ల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. హనుమాన్ విగ్రహానికి ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సల్లగుంజ ఎక్కే కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచ్‌లు అంకం గంగామణి, వెంకాయి హరితారెడ్డి పాల్గొన్నారు.

